## క్లుప్తంగా

### పూడిక తీత పనులు సక్రమంగా నిర్వహించాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలోని 20వ డివిజన్‌లో పూడిక తీత పనులు సక్రమంగా నిర్వహించాలని ఆ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి వై. శ్రీరంజన్‌రెడ్డి కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌బీసీ సర్కిల్ నుంచి ఆర్‌టీసీ బస్టాండు వరకూ ఉండే కాలువల్లో పూడిక సక్రమంగా తీయలేదని, దీనివల్ల వర్షాకాలంలో కాలువలోని నీరు రోడ్ల పైకి వచ్చి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడే అవకాశముందన్నారు. కావున మళ్లీ పూడిక తీయించాలన్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీలో భరదన్ బ్యాంకు వీధిలో ఉండే రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని, ఆ రోడ్డును నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ విభాగం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

### 14 న ఆర్డీఓ కార్యాలయం ముట్టడి

కడప వైఎస్ఆర్ సర్కిల్: పాత కడప దళితుల భూముల విషయమై 22 రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా అధికారులలో చలనం లేదని, ఈ నెల 10న దీక్ష శిబిరం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం, 14న ఆర్డీఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి తెలిపారు. సోమవారం పాత కడప దళిత భూముల విషయంపై చేస్తున్న రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. దీక్షలో కూర్చున్న వాళ్లు పాలమ్మ, ఓబులమ్మ, దివాకర్, హనుమంతు, ఓబులేసు ఉన్నారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటేష్, మడగలం ప్రసాద్, తస్లీమ్, లక్ష్మీదేవి, ప్రతాప్ రెడ్డి, ఓబులేసు, నూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

### విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



వైవీయూ ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుండి పీజీ వరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదుట పీడీఎస్‌యూ నాయకులు ఆందోళన నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, జిల్లా అధ్యక్షులు ఎస్.నాగేశ్వరరావులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 117 జీవో వల్ల మూసి వేసిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ. 4200 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ, నర్సింగ్ ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థులకు మార్కుల జాబితాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం యోగివేమన విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.100 కోట్లు విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మహేష్, శ్రీకాంత్, శాంత్, జ్యోతిబస్, పెరుమాళ్, విక్కీ,నియాజ్ అహ్మద్, భాస్కర్ రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

### 13న దూదేకుల సంక్షేమ సంఘం సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 13న ఒంటిమిట్టలోని హరిత టూరిజం రెస్టారెంట్‌లో నూర్ బాష్ దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు నూర్ బాష్ దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరి చిన్న రాజ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూర్ బాష్ దూదేకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహ్మద్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు నాగుల్ మీరా, బాబన్ తో పాటు పలువురు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని నూర్ బాష్ దూదేకుల కుల సంఘీయులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకేసుల బాష, రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కమాల్ బాష, రాష్ట్ర కార్యదర్శి కెపీ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్ళాయప్ప పాల్గొన్నారు.

### విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ రంగాన్ని కాపాడుకుందాం, ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని యుఈఈయు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం దేశ వ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలోని విద్యుత్ భవన్ ఆవరణంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూ నియన్ గౌరవ అధ్యక్షులు కామసూరు శ్రీనివాసులు రెడ్డి , కోశాధికారి కె.సురేంద్ర, కే నాగ మల్లయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు మోసాలను ప్రతి గడపకు తీసుకెళ్దాం

- ఏడాదిలో వేధింపులు తప్ప అభివృద్ధి లేదు
- వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన సంక్షేమాన్ని తెలియజేద్దాం
- కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం
- రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి , కడప మేయర్ సురేష్‌బాబు



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

రైల్వేకోడూరు అర్బన్ : అబద్ధాలు, వెన్నుపోట్లు చంద్రబాబు అధికారంలోకి రావడానికి మెట్లు అని జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ సురేష్ బాబు, కడప పార్లమెంట్ ఇన్‌చార్జ్ కొండూరు అజయ్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం రైల్వేకోడూరులోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మేనిఫెస్టోని పవిత్ర గ్రంథంగా భావించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఏడాదిలోనే పథకాలు అమలు చేసి మాట నిలబెట్టుకున్నాడు. వైఎస్ జగన్ చేసిన సంక్షేమం కంటే ఎక్కువ ఇస్తాను అని 2024 ఎన్నికల ప్రచారాల్లో చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏడాది అయినా పథకాలను అమలు చేయడం లేదని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ (వైఎస్సార్‌సీపీ) చిత్తశుద్ధిని, ప్రస్తుత చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ మోసపూరిత విధానాన్ని ప్రజలకు తెలియజేసి చైతన్యపరచాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ అని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు ఏమీ చేయకుండానే అన్ని అమలు చేసేశామని చెబుతుండటంతో ప్రజలు అవాక్కవ్వాల్సిన స్థితికి వచ్చారన్నారు. ఏడాది పూర్తయ్యాక ప్రజలు పథకాల గురించి అడుగుతే అన్ని అమలు చేశాం.. ఎవరైనా ప్రశ్నిస్తే వారి నాలుక మందం అనడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. బాబు ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు చూపించి ఏ విధంగా మోసం చేశారో తెలియజేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు సూచించారు. ఏడాది కాలంలో టీడీపీ నాయకులు చేసిన అరాచకలను ప్రజలకు గుర్తుచేయాలని తెలియపరిచారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఇబ్బందులు ఎదుర్కొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పినట్టు 2.0లో సముచిత స్థానం ఉంటుందని హామీనిచ్చారు.

**దివంగత నేతలకు నివాళులు**

ఇటీవల కాలంలో మృతి చెందిన నాయకులు పంజం సుకుమార్‌రెడ్డి, గుంటిమడుగు సుధాకర్‌రాజు, బత్తిన శశికుమార్‌రెడ్డి, యామల రాజ, రఫీ, గుత్తి సురేష్‌లకు నాయకులుఘనంగా నివాళులు అర్పించి పార్టీకి వారు చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, తోట శివసాయి, జిల్లా యువజన అధ్యక్షులు ఎలకచర్ల శివప్రసాద్‌రెడ్డి, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, అన్వర్‌బాషా, మార్రెళ్ల రాజేశ్వరి, భరత్‌కుమార్ రెడ్డి, సిద్దయ్య, నందబాల, ముస్తాక్, డీవీరమణ, రత్తయ్య, సుబ్బరామరాజు, బండారు మల్లి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

### మరణం లేని మహానేత వైఎస్ఆర్

కడప కార్పొరేషన్: మరణం లేని మహానేత డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు ఎస్. శివరామ్ అన్నారు. సోమవారం ప్రకాష్‌నగర్‌లోని స్నేహాలయ వృద్ధాశ్రమంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ ఆదేశాల మేరకు వృద్ధులు, అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేసి వైఎస్సార్ జయంతిని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమ పథకాలతో వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర కార్యదర్శి కొప్పుల శివ యాదవ్ మాట్లాడారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వారికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కె.బాదుల్లా, ప్రధాన కార్యదర్శి షిండే, రవి చంద్ర, కార్యదర్శి ప్రసాద్, కె. క్రిష్ణ, రవి కుమార్, సుధీర్ గౌడ్, శ్రీనివాసులు, పార్వతీశం, వెంకటసుబ్బయ్య, అంజి పాల్గొన్నారు.

### వినియోగదారుల హక్కుల కమిషన్ వైస్ ఛైర్మన్‌గా రాకేష్

కడప కార్పొరేషన్: ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ జిల్లా వైస్ ఛైర్మన్‌గా చెన్నూరు మండలం కొత్త గాంధీనగర్ కు చెందిన నాగలారపు రాకేష్ వర్మను నియమించినట్లు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎం .సురేష్ బాబు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో జాతీయ ఛైర్మన్ డా. సాయి రమేష్ ఆదేశాల మేరకు నియామక పత్రాన్ని, మెంబర్‌షిప్ సర్టిఫికెట్, ఐడీ కార్డును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఎక్కడైతే వినియోగదారులు నష్ట పోతారో అక్కడ ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వెన్నంటే ఉంటుందన్నారు. ఎవరైనా వస్తువులు కొనేటపుడు నష్టపోకుండా సూచనలు ఇచ్చి, మోసపోకుండా చూస్తామన్నారు. అనంతరం రాకేష్ వర్మ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బూసిపాటి



వైఎస్ అవినాష్‌రెడ్డికి సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బూసిపాటి కిశోర్

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బూసిపాటి కిశోర్ నియమితులవడం అభినందనీయమని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పులివెందులలోని ఎంపీని, కడపలో జిల్లా అధ్యక్షుడిని కిశోర్ మర్యాద పూర్వకగా కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు ఇరువురిని శాలువాలతో ఘనంగా సత్కరించి, స్వీట్లు తినిపించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ బూసిపాటి, శ్రీరాములు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలల దోపిడీ అరికట్టాలి

– బీసీ సంక్షేమ సంఘం రిలే దీక్షలు



కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ప్రైవేటు పుస్తకాల పల్లి షర్లతో కలిసి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.రెడ్డిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నదన్నారు. కానీ, ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలకు అదనంగా బండెడు పుస్తకాలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాయని తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థుల కోసం 6 నుంచి 8 వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫీజు రూ. 70 వేలు, పుస్తకాలకు రూ. 15 వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్లే క్లాస్ బుక్స్‌కు, ఫీజుకు రూ. 13 వేలు ఇవ్వాల్సి వస్తోందన్నారు. ఎలాంటి వసతులు, అనుమతులు లేకుండా ఇరుకైన భవనాల్లో విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్‌ఎండీ బాష, కృష్ణ కిరిటీ, మునికుమార్, రామలక్షుమ్మ, నాగరాజు, నాగేంద్ర, ఓబయ్య, వెంకట స్వామి, కడపటౌన్ బుక్స్ అండ్ స్టేషనరీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సుమన్, పి.రాఘవేంద్ర, కార్యదర్శులు కిరణ్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

## సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి




కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్: సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, 12వ పీఆర్సీ ప్రకటించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు డిమాండ్ చేశారు. సోమవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వారు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ రంగంలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు పార్క్ కూలీలకు ఆఫీస్ సిబ్బందికి టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా రూ.21000, రూ.24500 వేతనాలు ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు 8 గంటల పనిదినాల స్థానంలో 10 గంటల పనిదినాలు తీసుకురావడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు, రిటైర్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ తక్షణం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే లింగన్న, నాయకులు సునీల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నగేష్, నగర కోశాధికారి వెంకటాద్రి, నాయకులు జనార్ధన, చంద్ర పోతూ పాల్గొన్నారు.

**12 అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె– సీఐటీయూ**

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేది అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు తెలిపారు. సోమవారం వారు నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. సమ్మె వల్ల కలిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య, మున్సిపల్ జిల్లా కోశాధికారి గోపి, జిల్లా సహాయ కార్యదర్శి ఆనంద రావు, వాటర్ కార్మికులు జయపుత్రుడు, చెంద్రాయుడు, సోమిరెడ్డి, రాంమోహన్ రెడ్డి, శరత్ పాల్గొన్నారు.

## సమ్మెను జయప్రదం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆలిండియా రీజినల్ రూరల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపుమేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీసర్స్ యూనియన్ల సభ్యులు లేబర్‌కోడ్స్ రద్దు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 9వ తేదీన చేపట్టే అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ గ్రామీణ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.మహమ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం వారు సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను అణగదొక్కుతూ వారి కష్టాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడం కోసం అన్యాయమైన లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చిందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దుచేయాలని, గ్రామీణ బ్యాంకులపై ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు హనుమంతరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ లోహిత్ మనోజ్, ఎంఎఫ్ఆర్ఆర్‌బీఈఈ జాయింట్ సెక్రటరీ రాహుల్ తేజ్, రీజినల్ సెక్రటరీ రఫీ, ఏపీజీబీ ఎస్సీ ఎస్టీ జనరల్ సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### 10న ఆర్ట్స్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జులై 10వ తేదీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవంతోపాటు గురుపూజోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాలకు కళాశాల పూర్వ విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 2024–25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కాలేజ్ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బంగారు పతకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందులో స్టాటిస్టిక్స్‌లో కేవి సుబ్రహ్మణ్యంకు, గణితంలో పి. శేషప్ప, జియాలజీలో సజ్జల దివాకర్‌రెడ్డి, కెమిస్ట్రీలో ఎం. సర్వేశ్వరరాజు, కామర్స్‌లో మోహన్ రెడ్డి, బోగా పార్వతమ్మలకు గోల్డ్ మెడల్‌తో సత్కరించనున్నట్లు తెలిపారు. అలాగే కళాశాలలో గతంలో పనిచేసిన పూర్వ గురువులను సత్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చెరుకూరు శ్రీధర్, యోగివేమన విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ అల్లం శ్రీనివాసరావు, పదవీ విరమణ కృష్ణా జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డిలతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

### విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఎస్ఆర్ ఆర్కిటెక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. సోమవారం వైఎస్ఆర్ ఆర్కిటెక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న 6వ రోజు దీక్షలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల సంఘీభావం తెలిపి విద్యార్థులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీపై రాజకీయాలు చేయవద్దన్నారు. వైఎస్ఆర్ పేరు అభ్యంతరమైతే ఏ జాతీయ స్వాతంత్ర నాయకుడి పేరు పెట్టినా మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఈ ప్రత్యేకమైన యూనివర్సిటీని జిల్లాలోనే ఉంచి అభివృద్ధి చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి వలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాహుల్ పాల్గొన్నారు.

### రస్తా స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మండలం పుట్లంపల్లి గ్రామం సర్వే నంబర్ 2/2లో పేదలకు కేటాయించిన రస్తా స్థలం 19 అడుగులు ఆక్రమించి పునాది తీసిన సుబ్బరాయుడు, మరో ఇద్దరు వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని సోమవారం ఉదయం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో బాధిత ప్రజలు జేసీ అదితిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, సాంబశివుడు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి ఈ స్థలం మా స్వాధీన అనుభవంలో ఉన్నదని, గతంలో రెవెన్యూ అధికారులు 14 మందికి ఇండ్ల పట్టాలు కేటాయించి ఇచ్చారని రాకపోకలకు రస్తా కూడా ఏర్పాటు చేశారన్నారు. ఇదే స్థలం పక్కన ఉన్న ప్లాట్ యజమాని సుబ్బరాయుడు మరో ఇద్దరు వ్యక్తులు దౌర్జన్యంతో జేసీబీ ద్వారా మాకు కేటాయించిన రస్తా స్థలంలో పునాది తీశారన్నారు. విచారించి న్యాయం చేయాలన్నారు.

### క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదగాలి

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరుతేవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురు బాషా తెలిపారు. సోమవారం కడప నగరం ఊటుకూరులోని ముక్తియార్ విద్యాసంస్థల విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపై, యువతపై ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకుని నడుచుకోవాలని సూచించారు. పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ – 112, రహదారి భద్రత, సోషల్ మీడియా – సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ రక్త గ్రూపు తెలుసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపును తెలుసుకోవాలని , ప్రాణాపాయ స్థితిలో అత్యవసర సమయంలో చికిత్స అందించడానికి ఇది ఎంతో దోహదపడుతుందని శ్రీ బాలాజీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ పీర్ పేర్కొన్నారు.సోమవారం కడప నగరం జామున్ బౌలిలోని నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో శ్రీ బాలాజీ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఎస్ కే ల్యాబ్ వారు 200 మంది విద్యార్థులకు ఉచితంగా రక్త నమూనా పరీక్షలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎలిజిబెత్ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ నిబంధనలు పాటించని మైదుకూరులోని శ్రీ వెంకటేశ్వర బాలికల జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. కనీస వసతులు లేకున్నా ఉన్నట్లుగా చూపించి తప్పుడు పద్ధతుల్లో అనుమతులు పొందారన్నారు. కళాశాల గుర్తింపు రద్దుతోపాటు ఇంటర్మీడియేట్ బోర్డు అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గోపి, నరసింహా పాల్గొన్నారు.

### దుకాణాల కేటాయింపులో న్యాయం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉన్నతాధికారులు పేద వర్గాల పట్ల నిర్లక్ష్యాన్ని వీడి ఆర్టీసీ బస్టాండులో దుకాణాల కేటాయింపులో తగిన న్యాయం జరిగేలా చూడాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు సీపీఎం నాయకులు, బాధితులు కడపలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రామ్మోహన్ మాట్లాడుతూ గదుల విషయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పేద బడుగు బలహీన వర్గాలకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నామని తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో ఆర్టీసీ టెండర్లలో ప్రవంతి అనే దళిత మహిళ పాల్గొని పి.17ఏ, పి17సి రూములను టెండర్లలో దక్కించుకున్నారన్నారు. అయితే టెండర్ అలాట్మెంట్ ఆర్డర్ కూడా ఆర్టీసీ యాజమాన్యం జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు కొలతలు వేసి రూములు చూపెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే జిల్లాలోని మరికొన్ని ప్రాంతాల్లో సైతం ఇలాంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులతోపాటు బాధితులు పాల్గొన్నారు.

### సార్వత్రిక సమ్మెకు యూటీఎఫ్ మద్దతు

కడప ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా 9వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెకు యూటీఎఫ్ సంపూర్ణ మద్దతును తెలియచేస్తుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం కడప యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో 9న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా జరిగే ర్యాలీ, నిరసన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకువచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల పని గంటలను 8 గంటల నుంచి 12 గంటలకు పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక పోరాటాల ఫలితంగా ఎనిమిది గంటల పని విధానాన్ని సాధించుకున్న చరిత్ర కార్మిక సంఘాలకు ఉందన్నారు. అలాంటి ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచటాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## బాబు పాలనలో సంక్షేమం ఊసే లేదు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

జమ్మలమడుగు : చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జమ్మలమడుగు పట్టణం సాయిశివాని కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మూడు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తే చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేవలం ఒక్క ఏడాదిలోనే లక్షా 70 వేల కోట్ల రూపాయల అప్పులు చేసిందన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు అప్పును సృష్టించారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పి రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఏ కార్యకర్త, నాయకులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అండ ఎప్పుడూ ఉంటుందన్నారు. గతంలో కార్యకర్తలను విస్మరించడంతోనే మనం చేసిన పనులు క్షేత్రస్థాయిలో తీసుకెళ్లలేకపోయామని, ఇప్పుడు కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు ఏమిటి.. ప్రస్తుతం ఎన్ని అమలు చేశాడనే విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. కేంద్రం నుంచి అప్పు రూపంలో తెచ్చిన లక్షా 70 కోట్ల రూపాయలు ఎక్కడిపోయాయని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కేవలం అమరావతి పేరుతో ప్రజా ధనాన్ని కమీషన్ల రూపంతో దండుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.

**మళ్లీ అధికారంలోకి వచ్చే వరకు ప్రజల్లోనే: ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి**

రాష్ట్రంలో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేంత వరకు కార్యకర్తలు, నాయకులందరూ కలిసికట్టుగా ప్రజల్లోనే ఉండాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్థానంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కూర్చోబెట్టడమే మనందరి లక్ష్యం కావాలన్నారు. అందుకోసం బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీని ప్రజా క్షేత్రంలోకి తీసుకెళదామన్నారు. ప్రజల సంక్షేమం పూర్తిగా గాలికి వదిలేసి నాయకులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంతో తమకేమీ సంబంధంలేదు. తమ వాటా తమకు కావాలి అన్న రీతిలో సాగుతున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, రవీంద్రనాథరెడ్డిని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోగిడి జయన్న, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర జనల్ సెక్రెటరీ లక్షుమయ్య, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, ముల్లాజానీలు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సునీల్‌కుమార్, రఫీ, పి.గిరిధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మండలాల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.